సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 31 । జనవరి । 2023



చీనీ టన్ను రూ.28 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.28 వేలు పలికాయి. మార్కెట్‌కు 100 టన్నులు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.20, కనిష్టం రూ.5, సరాసరి రూ.12 పలికింది. మార్కెట్‌కు 765 టన్నులు అమ్మకానికి వచ్చాయి.

గరిష్టం/కనిష్టం
31.8°/14.1°

జిల్లాలో సోమవారం చలి వాతావరణం నెలకొంది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఆగ్నేయ దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

'నవోదయ' దరఖాస్తు గడువు పొడిగింపు



లేపాక్షి: జవహర్ నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఫిబ్రవరి 8వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు లేపాక్షి విద్యాలయ ప్రిన్సిపాల్ నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల కోసం దరఖాస్తుకు గతంలో ఈనెల 31వ తేదీ వరకు అవకాశం ఇచ్చారు. అయితే కొన్ని సాంకేతిక కారణాల దృష్ట్యా దరఖాస్తుకు ఇబ్బందులు తలెత్తడంతో గడువు పొడిగించినట్లు ఆయన వెల్లడించారు.

'డి–ఫార్మసీ'లో స్పాట్ అడ్మిషన్లు

హిందూపురం: స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో 2022–23 విద్యాసంవత్సరానికి గాను డి–ఫార్మసీ కోర్సులో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు చేపట్టారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరీష్‌బాబు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇంటర్‌లో బైపీసీ, ఎంపీసీ ఉత్తీర్ణులైన వారు అర్హులు. అడ్మిషన్ పొందాలనుకునే వారు సరైన ధ్రువీకరణ పత్రాలు, రూ.6,500 టర్మ్ ఫీజుతో ఫిబ్రవరి 2న ఉదయం 9 గంటలకు కళాశాలలోని ఫార్మసీ విభాగానికి చేరుకోవాలి. పూర్తి వివరాలకు 98662 73402, 97038 43680 నంబర్లలో సంప్రదించవచ్చు.

వితంతువుపై అత్యాచారయత్నం

నల్లమాడ: మసకవంకపల్లిలో వితంతువుపై ఓ వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం చోటు చేసుకొంది. ఎస్‌ఐ వలీబాషా తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన కుంచెపు సునంద వయస్సు 40 ఏళ్లు. ఈమె భర్త సోమశేఖర్ 10 ఏళ్లక్రితమే మృతిచెందాడు. ఈమెకు ముగ్గురు సంతానం కాగా పూలు అమ్ముకొంటూ జీవనం సాగిస్తోంది. సునంద ఇంటికి ఎదురుగా నివాసం ఉండే కే.శ్రీనివాసులు అనే వ్యక్తి తన కోర్కె తీర్చాలంటూ 6 నెలలుగా ఆమె వెంటపడుతూ లైంగికంగా వేధిస్తున్నాడు. ఇది మంచి పద్ధతి కాదు, నాకు వివాహమై కుమార్తెలు ఉన్నారని ఆమె పలుమార్లు హెచ్చరించినా పట్టించుకోలేదు. సోమవారం ఉదయం సునంద ఒంటరిగా ఉన్న విషయం గుర్తించిన శ్రీనివాసులు ఇంట్లోకి చొరబడి చెయ్యి పట్టుకొని లాగాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో పొరుగున ఉన్న ఆమె మరిది లక్ష్మణ, తండ్రి వెంకట్రామన్న, తల్లి లక్ష్మమ్మ మరికొందరు అక్కడికి చేరుకోవడంతో నిందితుడు పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వలీబాషా పేర్కొన్నారు.

జీవితాల్లో పదివేల కాంతులు

- జగనన్న చేదోడు మూడో విడతలో జిల్లాలోని 10,781 మందికి లబ్ధి
- లబ్ధిదారుల ఖాతాల్లో రూ.10.78 కోట్లు జమ
- మెగా చెక్కు పంపిణీ చేసిన కలెక్టర్ బసంత్‌కుమార్
- ఆనందోత్సాహాల్లో రజక, నాయీబ్రాహ్మణ, దర్జీలు



'జగనన్న చేదోడు'చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్, ప్రజాప్రతినిధులు

పుట్టపర్తి అర్బన్: స్వయం ఉపాధిని నమ్ముకున్న చేతి వృత్తిదారుల సంక్షేమం కోసం వైఎస్ జగన్ సర్కార్ ప్రవేశపెట్టిన చేదోడు పథకం ఎందరో జీవితాల్లో వెలుగులు నింపుతోంది. ఇప్పటికే వరుసగా రెండేళ్ల పాటు ఒక్కో లబ్ధిదారునికి రూ.10 వేల చొప్పున అందజేసిన రాష్ట్ర ప్రభుత్వం... తాజాగా సోమవారం మూడో విడత సొమ్ము విడుదల చేసింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ఉదయం పల్నాడు జిల్లా వినుకొండలో జరిగిన బహిరంగ సభలో బటన్‌నొక్కి మూడో విడత జగనన్న చేదోడు పథకానికి సంబంధించిన నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. కలెక్టరేట్ వీసీ హాలు నుంచి కలెక్టర్ బసంత్‌కుమార్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అవుటాల రమణారెడ్డి, పుడా చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, ఎంపీపీ ఏవి రమణారెడ్డి, బీసీ కార్పొరేషన్ అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

జిల్లాకు రూ.10.78 కోట్లు..

కలెక్టర్ బసంత్‌కుమార్ మాట్లాడుతూ.... 'జగనన్న చేదోడు' పథకం కింద మూడో విడతలో జిల్లాలోని అర్హులైన 10,781 మంది రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లకు రూ.10.78 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. ఇందులో 5,624 మంది రజకుల ఖాతాల్లో రూ.5.62 కోట్లు, 1,839 మంది నాయీ బ్రాహ్మణుల ఖాతాల్లో రూ.1.83 కోట్లు, 3,318 మంది టైలర్ల ఖాతాల్లో రూ.3.31 కోట్లు జమ అయ్యాయన్నారు. చేతివృత్తిదారులు ఆర్థికంగా ఎదగడానికి రాష్ట్ర ప్రభుత్వం చేదోడు కింద ఏటా రూ.10 వేల చొప్పున ఆర్థిక సహకారం అందిస్తోందన్నారు. గతంలో రెండు విడతలు అందజేసిన ప్రభుత్వం.. మూడో విడత చెప్పిన సమయానికే నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసిందన్నారు.

అర్హులుంటే దరఖాస్తు చేసుకోండి..

జగనన్న చేదోడు పథకం కింద మొదటి సంవత్సరం (2019–20) జిల్లాలో 8,967 మందికి రూ.8.9 కోట్లు, రెండో ఏడాది (2021–22) 9,049 మంది లబ్ధిదారులకు రూ.9.04 కోట్లు ప్రభుత్వం అందజేసిందని కలెక్టర్ తెలిపారు. మూడో విడతలో లబ్ధిదారుల సంఖ్య పెరిగిందన్నారు. ప్రస్తుతం జిల్లాలో చేదోడు లబ్ధిదారులు 10,781 మంది ఉన్నారని, వారందరికీ ఖాతాల్లో డబ్బు జమ అవుతుందన్నారు. అర్హులు ఎవరైనా మిగిలిపోయి ఉంటే సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని, పరిశీలించి పథకం అందేలా చూస్తామన్నారు.

మాట తప్పని సీఎం జగనన్న..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాటిస్తే చాలు...అమలైనట్లేనని జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, పుడా చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, ఎంపీపీ ఏవి రమణారెడ్డి అన్నారు. ఈ క్రమంలోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి సంక్షేమ పథకాన్ని క్యాలెండర్ వారీగా సీఎం నెరవేరుస్తున్నారన్నారు. లంచాలకు, వివక్షకు తావులేకుండా అత్యంత పారదర్శకంగా గ్రామ వార్డు సచివాలయాల్లో అర్హుల జాబితాను ప్రదర్శించి మరీ పథకాలను అందజేస్తున్నారన్నారు. వెనుకబడిన తరగతుల వారి వెన్నెముకనవుతానన్న సీఎం జగన్...ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. పేద ప్రజల దీవెనలే జగనన్నకు శ్రీరామరక్ష అన్నారు. పేదలకు అండగా నిలబడినందుకే సీఎం జగన్‌కు మనమంతా మద్దతు ఇవ్వాల్సిన బాధ్యత ఉందన్నారు. చేదోడు పథకం కింద అందిన డబ్బును లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం చేదోడు పథకానికి సంబంధించిన మెగా చెక్కును కలెక్టర్ బసంత్‌కుమార్, ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు అందజేశారు.

జగనన్నకు రుణపడి ఉంటా



నాకు ఎవరి సిఫార్సు లేకుండానే మూడో ఏడాది సైతం రూ.10 వేల ఆర్థిక సాయం అందింది. ఈ డబ్బుతో షాపుకు కావాల్సిన మెటీరియల్ కొనుగోలు చేస్తా. మమ్మల్ని ఇంతవరకూ ఎవరూ పట్టించుకోలేదు. జగనన్న ఒక్కరే మా బాగోగులు చూస్తున్నారు. అందుకే ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– చెన్నకేశవులు, బ్రాహ్మణపల్లి, పుట్టపర్తి

అర్హత ఆధారంగా పథకాలు



అర్హత ఆధారంగానే ఈ ప్రభుత్వం పథకాలు అందజేస్తోంది. నేను పుట్టపర్తి పట్టణంలోని కుమ్మరి పేటలో నివాసం ఉంటున్నాను. నాభర్త కిడ్నీ సమస్యతో చనిపోయాడు. అప్పటి నుంచి వితంతు పింఛన్ వస్తోంది. కుటుంబ పోషణకు టైలరింగ్ చేసుకుంటుండగా.. చేదోడు ద్వారా ఏటా రూ.10 వేల ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఈ పథకాలతోనే నా కుటుంబాన్ని పోషించుకుంటున్నా.

– పూల గాయత్రి, కుమ్మర పేట, పుట్టపర్తి

పేదలకు కొండంత అండ



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు కొండంత అండగా నిలుస్తున్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థ తీసుకురావడంతో పథకాల అమలు పారదర్శకంగా సాగుతోంది. గతంలో ఇటువంటి పథకాలు ఎప్పుడూ చూడలేదు. గ్రామాల్లో ఎక్కడ చూసినా ఇవే చర్చలు. నాకు మూడో ఏడాది చేదోడు పథకం ద్వారా లబ్ధి చేకూరింది. చాలా సంతోషంగా ఉంది.

– వెంకటనారాయణ, రజకులు, పుట్టపర్తి

వలంటీరే వచ్చి చేయించాడు



నేను ఈ ఏడాదే టైలరింగ్ షాపు పెట్టుకున్నా. వలంటీర్, సచివాలయ సిబ్బంది వచ్చి చేదోడు పథకం గురించి నాకు చెప్పారు. వారే ఫొటోలు తీసుకొని వెళ్లి పథకం మంజూరయ్యేలా చూశారు. నేను ఏ నాయకుడినీ, అధికారినీ కలవలేదు. ఇంత పారదర్శకంగా పథకాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాము.

– సరోజమ్మ, టైలర్, ఎనుములపల్లి, పుట్టపర్తి

నకిలీ వైద్యుడి అరెస్ట్

- సహకరించిన ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్‌కు కటకటాలు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ జయనాయక్, ఎస్‌ఐలు లింగన్న, నరసింహుడు

కొత్తచెరువు: అర్హతలేకుండానే వైద్యుడి అవతారం ఎత్తి.. కొత్తచెరువులో గురుసాయి పేరుతో చిన్నపిల్లల ఆస్పత్రి నడిపిన గుర్రం కిరణ్‌తో పాటు ఆస్పత్రిలో పనిచేసిన ల్యాబ్ టెక్నీషియన్ అవుల మూర్తి, ఫార్మసిస్టు లక్ష్మీ నరసింహప్పను పోలీసులు అరెస్టు చేశారు. వివరాలను సోమవారం సీఐ జయానాయక్, ఎస్‌ఐలు లింగన్న, నరసింహులు మీడియాకు వెల్లడించారు. అర్హత లేకున్నా గుర్రం కిరణ్ అనే వ్యక్తి వచ్చీరాని వైద్యం చేస్తూ రోగుల ప్రాణాలతో ఆడుకుంటున్నారని కొందరు 'స్పందన'లో కలెక్టర్ బసంత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో 2022 అక్టోబర్ 11న ఇన్‌చార్జ్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ నివేదిత కొత్తచెరువులోని ధర్మవరం రహదారిలో ఉన్న గురుసాయి చిన్న పిల్లల ఆస్పత్రిని తనిఖీ చేశారు. అనుమతులు లేకపోవడంతో సీజ్ చేశారు. అలాగే ఆస్పత్రి నిర్వహిస్తున్న గుర్రం కిరణ్‌కుమార్‌కు అర్హత లేదని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆస్పత్రి నిర్వాహకుడితో పాటు సిబ్బంది పరారయ్యారు. కేసు నమోదు చేసిన సీఐ జయనాయక్ పర్యవేక్షణలో కొత్తచెరువు ఎస్‌ఐ లింగన్న కేసు దర్యాప్తు చేశారు. సోమవారం మామిళ్లకుంట క్రాస్‌లోని రాముడి గుడి వద్ద గుర్రం కిరణ్‌కుమార్, అవుల మూర్తి, లక్ష్మీ నరసింహప్పను అరెస్ట్ చేసినట్లు సీఐ వెల్లడించారు. కాగా, నకిలీ వైద్యుడు కిరణ్‌కుమార్ బాగోతాన్ని గతంలో 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. వచ్చీరాని వైద్యం చేస్తూ రోగుల ప్రాణాలతో ఆడుకుంటున్న వైనంపై కథనం ప్రచురించింది.

లేపాక్షిలో టూరిస్ట్ పోలీస్ కేంద్రం

- స్థల పరిశీలన చేసిన ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్



లేపాక్షి ఆలయం వద్ద పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ

లేపాక్షి: రాష్ట్రంలోని వివిధ పర్యాటక ప్రాంతాల్లో ప్రత్యేకంగా టూరిస్ట్ పోలీస్ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. శిల్పకళకు ప్రఖ్యాతి గాంచిన లేపాక్షిలోనూ ప్రత్యేకంగా పోలీస్ కేంద్రం ఏర్పాటు చేస్తోంది. ఈ క్రమంలోనే సోమవారం ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ లేపాక్షికి విచ్చేశారు. టూరిస్ట్ పోలీసు కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. ఆలయ ప్రాంగణంలోని పరిసరాలు, నంది విగ్రహం, జటాయువు ఘాట్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించి వివిధ కేసుల పురోగతిపై ఆరా తీశారు. అదేవిధంగా రికార్డులను పరిశీలించి సిబ్బంది పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ విలేకరులతో మాట్లాడుతూ...పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసేందుకు ప్రత్యేక పోలీసు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఎస్పీ వెంట పెనుకొండ ఇన్‌చార్జ్ డీఎస్పీ యశ్వంత్, సీఐ వేణుగోపాల్, ఎస్‌ఐలు మునీర్‌అహమ్మద్, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

కదిరిలో ఇండస్ట్రియల్ పార్కు

- వంద ఎకరాలను సేకరించిన ఏపీఐఐసీ
- 1000 మందికిపైగా ఉపాధి అవకాశాలు
- ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఆహ్వానం
- ఎకరం రూ.6.50 లక్షలకే కేటాయింపు



ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తున్న ప్రాంతం

కదిరి: యువతకు స్థానికంగానే ఉపాధి కల్పించాలని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక రంగంపై దృష్టి సారించింది. ఈ క్రమంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు మౌలిక వసతులు కల్పించి భూమి అప్పగించడంతో పాటు పరిశ్రమ ఏర్పాటుకు సింగిల్ డెస్క్ ద్వారా వీలైనంత త్వరగా అనుమతులు మంజూరు చేస్తోంది. దీంతో పారిశ్రామిక వేత్తలంతా జిల్లా బాట పట్టారు.

ముత్యాల చెరువు సమీపంలో ఇండస్ట్రియల్ పార్కు

కదిరి–బెంగళూరు జాతీయ రహదారిని ఆనుకొని కదిరి మండలం ముత్యాలచెరువుకు సమీపంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే ఏపీఐఐసీ(ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్) స్థానిక రైతుల నుంచి 93.11 ఎకరాల భూమిని సేకరించింది. ఇందులో 13.06 ఎకరాలు (14.03 శాతం) రోడ్ల కోసం, 9.32 ఎకరాలు (10.01శాతం) ఓపెన్ స్పేస్ కోసం, 4.21 ఎకరాలు (04.53శాతం) బఫర్ జోన్ ఏరియా కోసం, 2.05 ఎకరాలు (02.20శాతం) యుటిలిటీ ఏరియా కోసం, 3.70 ఎకరాలు (03.97శాతం) అమెనిటి ఏరియా కోసం, 1.54 ఎకరాలు(01.65శాతం) స్ట్రీమ్ ఏరియా కోసం, 6.76 ఎకరాలు (07.26శాతం) జనరల్ పార్కింగ్ కోసం కేటాయించింది. ఇక మిగిలిన 52.47 ఎకరాలను (56.35 శాతం) 62 ప్లాట్లుగా విభజించి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఇవ్వడానికి ఏపీఐఐసీ సిద్ధం చేసింది. ఒక్కో ప్లాట్ అర ఎకరం నుంచి ఎకరం వరకూ ఉన్నాయి. ఎకరం ప్లాట్‌కు రూ.6.50 లక్షల చొప్పున ధర నిర్ణయించారు. ఇప్పటికే 10కి పైగా ప్లాట్లు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు కేటాయింపులు జరిగాయి. మొత్తమ్మీద ఇక్కడ 20కి పైగా పలు రకాల పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. వీటి ద్వారా రానున్న రోజుల్లో 1,000 మందికిపైగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

మౌలిక సదుపాయాల కల్పన..

ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తున్న చోట భూమిని చదును చేసే దగ్గర నుండి రోడ్లు వేయడం , విద్యుత్ సౌకర్యం కల్పించడం... ఇలా అన్ని మౌలిక సదుపాయాలను కల్పన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వమే తీసుకుంటుంది. అలాగే పరిశ్రమల ఏర్పాటు చేసే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు వివిధ బ్యాంకుల నుంచి రాయితీతో రుణాలు పొందే అవకాశం కూడా ప్రభుత్వమే కల్పిస్తుంది. ఏ పరిశ్రమ నెలకొల్పుతున్నారు, అందులో ఎంత మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తారు... అనే విషయాలు కూడా పారిశ్రామిక వేత్తలు ప్లాట్లు తీసుకునేటప్పుడే దరఖాస్తులో పేర్కొనాల్సి ఉంటుంది.

పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలం..

ముత్యాలచెరువుకు సమీపంలోని ఇండస్ట్రియల్ పార్కు కదిరి–బెంగళూరు జాతీయ రహదారిని ఆనుకొని ఉండటంతో పాటు తక్కువ ధరకే పారిశ్రామిక వేత్తలకు ఇక్కడ భూమి లభిస్తోంది. హంద్రీనీవా చెర్లోపల్లి రిజర్వాయర్ కూడా ఇక్కడికి 10 కి.మీ లోపు దూరంలోనే ఉంది. బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు కూడా దగ్గరే అవుతుంది. ఈ ప్రాంతం నుంచి పులివెందుల పరిసర ప్రాంతాలకు రోజూ ఉపాధి కోసం వెళుతున్న వారు చాలానే ఉన్నారు. ఇంకొందరు బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లో సెక్యూరిటీ గార్డులుగానో, గార్మెంట్ పరిశ్రమల్లోనో పని చేస్తున్న వారు వేల సంఖ్యలో ఉన్నారు. ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుతో వారందరికీ స్థానికంగానే ఉపాధి అవకాశాలు లభిస్తాయి. నివాసం ఉండటానికి జగనన్న కాలనీ కూడా ఇక్కడికి కి.మీ దూరంలోనే ఏర్పాటవుతోంది.


ఎందరికో ఉపాధి అవకాశాలు



ముత్యాలచెరువు వద్ద ఏర్పాటు చేస్తున్న ఇండస్ట్రియల్ పార్కుతో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల ఏర్పాటు చేస్తున్న పరిశ్రమల ద్వారా ఎంతోమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. వీటి ఏర్పాటుతో సీఎం వైఎస్ జగన్ ఆశయం నెరవేరనుంది. మాది చేతల ప్రభుత్వం.

–మెట్టు గోవిందరెడ్డి, చైర్మన్, ఏపీఐఐసీ

దరఖాస్తుల ఆహ్వానం



ముత్యాలచెరువు ఇండస్ట్రియల్ పార్కులో సుమారు 100 ఎకరాల్లో 62 ప్లాట్లు పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధం చేశాం. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ఏపీఐఐసీ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవచ్చు. ఎకరానికి రూ.6.50 లక్షలుగా ధర నిర్ణయించాం.

– మోహన్ మురళి, జోనల్ మేనేజర్, ఏపీఐఐసీ

అందరి ఆమోదం మేరకే



ముత్యాలచెరువు వద్ద ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు అనుకూలం కాదని కొందరు అడ్డుచెప్పారు. దీంతో క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితిని కలెక్టర్‌కు వివరించాం. పలు సమావేశాల్లో దీనిపై లోతుగా చర్చించాం. దీంతో ఇక్కడ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు అందరూ ఒప్పుకున్నారు. దీనివల్ల స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి.

– కోలా వెంకటరమణ, జిల్లా ఇండస్ట్రీస్ ప్రమోషన్ కమిటీ సభ్యులు

అందరికీ అనుకూలమే



జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న ముత్యాల చెరువు ప్రాంతంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయడం పారిశ్రామిక వేత్తలతో పాటు అందులో ఉపాధి పొందే వారికి కూడా ఎంతో అనుకూలంగా ఉంటుంది. తక్కువ ధరకే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్లాట్లు లభిస్తున్నాయి.

– డాక్టర్ పీవీ సిద్దారెడ్డి, ఎమ్మెల్యే, కదిరి

పరిష్కారం సంతృప్తికరంగా ఉండాలి

- స్పందన అర్జీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి
- అధికారులకు కలెక్టర్ బసంత్‌కుమార్ ఆదేశం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్, అధికారులు

పుట్టపర్తి అర్బన్: 'స్పందన' అర్జీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి గడువులోపు సంతృప్తికర పరిష్కారం చూపాలని కలెక్టర్ బసంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన 'స్పందన'లో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజలు 166 అర్జీలు అందించగా, కొన్నింటిపై అప్పటికప్పుడే అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ...అర్జీల్లో పేర్కొన్న సమస్యలకు గడువులోపే పరిష్కారం చూపాలన్నారు. పరిష్కరించలేని సమస్యలున్నట్లయితే...అర్జీదారులు అర్థం చేసుకునేలా సమాధానం ఇవ్వాలన్నారు. అలా చేయని అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. చాలా సమస్యలకు మండల కేంద్రాల్లోనే పరిష్కారం లభిస్తుందని, ఈ విషయం తెలియక గ్రామీణులు వ్యయ ప్రయాసల కోర్చి జిల్లా కేంద్రానికి వస్తున్నారన్నారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది సక్రమంగా పని చేస్తే అర్జీల సంఖ్య తగ్గుముఖం పడుతుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, స్పందన తహసీల్దార్ శ్రీనివాసులు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్పందనలో వచ్చిన అర్జీల్లో కొన్ని...

- తమ కుమారుడు భరత్‌కుమార్‌రెడ్డి ఉపాధి కోసం కువైట్‌కు వెళ్లాడని, అక్కడ ఉద్యోగం మానేయగా, సదరు యజమాని పాస్‌పోర్టు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడని గోరంట్ల మండలం ఎగువ గంగంపల్లికి చెందిన తల్లిదండ్రులు రమాదేవి బయపరెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తమ కుమారుడు భరత్‌ను స్వగ్రామానికి తీసుకురావాలని కోరారు.
- తన ఇంటి స్థలాన్ని కొందరు ఆక్రమించి ఇబ్బంది పెడుతున్నారని రొళ్ల మండలం కాలువపల్లికి చెందిన భీమప్ప కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తన ఇంటి నిర్మాణానికి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు.
- గ్రామంలోని సర్వే నంబర్ 1300–2లో తన పేరున ఉన్న 3.79 ఎకరాలను ఇతరులకు కౌలుకు ఇచ్చానని, అయితే మరొకరు వచ్చి పొలాన్ని ఆక్రమించడంతో పాటు పట్టాదారు పాసుపుస్తకం పొందారని నల్లమాడ మండలం కుటాలపల్లికి చెందిన చెన్నకేశవులుకు ఫిర్యాదు చేశారు. తనకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను వేడుకున్నారు.

'గడప గడపకూ' పనులు గ్రౌండ్ చేయాలి..

'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో గుర్తించి మంజూరు చేసిన పనులకు సంబంధించిన గ్రౌండింగ్ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ బసంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. అలాగే యుద్ధప్రాతిపదికన ఆయుష్మాన్ భారత్ ఈకేవైసీ పూర్తి చేయాలన్నారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని వీసీ హాలు నుండి అన్ని శాఖల అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ నిర్దేశించిన పనులను గడువులోపు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో చేపట్టిన భూరీసర్వే వేగవంతం చేయాలన్నారు. అలాగే ఉద్యోగులందరూ తప్పనిసరిగా ఏపీఎఫ్ఆర్ఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ముఖ ఆధారిత హాజరు వేయాలన్నారు. సచివాలయాలపై ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్ల పర్యవేక్షణ ఉండాలన్నారు. నిర్మాణ పనులకు సంబంధించి బిల్లులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులను పెండింగ్ లేకుండా చూడాలని తహసీల్దార్లను ఆదేశించారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్‌కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, డ్వామా పీడీ రామాంజనేయులు, పీఆర్ ఎస్ఈ గోపాల్‌రెడ్డి, డీసీహెచ్ఎస్ తిప్పేంద్రనాయక్, చేనేత జౌళి శాఖ ఏడీ రమేష్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి, ఆరోగ్యశ్రీ అధికారి యల్లప్ప, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాగులు, జొన్నల పంపిణీకి చర్యలు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో రేషన్‌కార్డుదారులకు మార్చి నెల నుంచి రాగులు లేదా జొన్నలు ఉచితంగా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి వంశీకృష్ణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో రేషన్ కార్డుకు కేటాయించిన బియ్యంలో 2 కిలోలు తగ్గించి అందుకు బదులుగా 2 కేజీల రాగులు లేదా జొన్నలు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు.

ఆర్బీకేల ద్వారా కొనుగోళ్లు: రాగులు, జొన్నలు పండించిన రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వమే కనీస మద్దతు ధర ఇచ్చి రైతు భరోసా కేంద్రాల ద్వారా పంటను కొనుగోలు చేస్తుందని డీఎస్‌ఓ వంశీకృష్ణారెడ్డి తెలిపారు. క్వింటా రాగులుకు రూ.3,578, క్వింటా జొన్నలకు రూ.2,970 చొప్పున మద్దతు ధర నిర్ణయించిందన్నారు. రాగులు, జొన్నలు పండించిన రైతులు పంట విక్రయానికి ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన 3,4 రోజుల్లోపు ఖాతాల్లో సొమ్ము జమ చేస్తామన్నారు.

క్లుప్తంగా

వాహనం ఢీకొని జింక మృతి



లేపాక్షి: రాష్ట్ర జంతువుగా అధికారికంగా గుర్తింపు పొందిన ఓ కృష్ణ జింక.. రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. లేపాక్షి మండలం మానేపల్లి సమీపంలోని ఎం.వెంకటాపురం గేట్ వద్ద సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. పొలాల్లో మేత కోసం వచ్చిన జింక రోడ్డు దాటుతున్న సమయంలో వేగంగా దూసుకొచ్చిన వాహనం ఢీకొంది. ఘటనలో జింక అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న అటవీ శాఖ సిబ్బంది అక్కడకు చేరుకుని జింక కళేబరాన్ని తీసుకెళ్లారు.

చీకటిమానిపల్లి వద్ద గుర్తు తెలియని మృతదేహం

తనకల్లు: మండలంలోని చీకటిమానిపల్లి వద్ద సోమవారం గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. గ్రామ సమీపంలోని మలుపు వద్ద మురుగు కాలువలో పడి ఉన్న మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. నాలుగైదు రోజుల క్రితం మృతి చెంది ఉంటాడని, శరీరం మొత్తం ఉబ్బి గుర్తు పట్టలేనంతగా మారిందని పోలీసులు తెలిపారు. 50-55 ఏళ్ల మధ్య వయసున్న మృతుడు టీ షర్టు, ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే తనకల్లు పోలీసులను సంప్రదించాలని కోరారు.

కేటాయింపుల్లో కూత పెట్టేనా?

- రేపు కేంద్ర బడ్జెట్..
- ధర్మవరం – బళ్లారి నూతన రైలుమార్గానికి నిధులు వచ్చేనా?
- గుంతకల్లు జంక్షన్ నుంచి ఒక్క ఎక్స్‌ప్రెస్ రైలైనా పట్టాలెక్కేనా?



గుంతకల్లు జంక్షన్ ప్రధాన ముఖద్వారం

గుంతకల్లు: దక్షిణ మధ్య రైల్వేలో ఆదాయపరంగా గుంతకల్లు డివిజన్ ముందంజలో ఉంది. అయితే ఈ డివిజన్‌కు ప్రతి బడ్జెట్‌లోనూ అన్యాయం జరుగుతూనే ఉంది. బుధవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టే బడ్జెట్‌లోనైనా న్యాయం చేస్తారేమోనని జిల్లా వాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

పేరుకే డివిజన్ కేంద్రం..

గుంతకల్లు రైల్వే డివిజన్.. దేశంలోనే మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఇంధన పొదుపులో రెండో స్థానంలో అవార్డు దక్కించుకోగా, ఇక స్టేషన్ బిల్డింగ్ ఎయిర్‌పోర్టు తరహాలో ఉందని స్వయాన రైల్వే మంత్రి స్టేషన్ బిల్డింగ్ ఫొటోలను ట్విట్టర్ ద్వారా పోస్టు చేసి కితాబు ఇచ్చారు. ఇంతటి పేరుగాంచిన డివిజన్ కేంద్రం గుంతకల్లులో ఒక్క ఎక్స్‌ప్రెస్ రైలు ఇక్కడ నుంచి ప్రారంభానికి నోచుకోలేదు. ఈ బడ్జెట్‌లోనైనా కనీసం గుంతకల్లు జంక్షన్ నుంచి హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు మార్గాల్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రకటించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నత్తనడకన ప్రాజెక్టులు

- 2016–17 బడ్జెట్‌లో గుంతకల్లు – గుంటూరు డబ్లింగ్ ప్రాజెక్టు ప్రకటించారు. మొత్తం 401 కి.మీ డబ్లింగ్ పనులకు రూ 3,631 కోట్లు మంజూరు చేశారు. గడిచిన బడ్జెట్‌లో రూ.803 కోట్లు కేటాయించారు. ఈ మార్గంలో ఇప్పటి వరకు 92 కి.మీ మేర డబ్లింగ్, విద్యుద్దీకరణ పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే విజయవాడ – విశాఖపట్నం మధ్య రాకపోకలు సాగించడానికి అనువుగా ఉంటుంది.
- కడప – బెంగళూరు మధ్య కొత్త ప్రాజెక్టుకు 2008–09లో ప్రణాళికలు తయారు చేసి రూ.2,706 కోట్లు కేటాయిస్తూ పనులు ప్రారంభించారు. మొత్తం 255 కి.మీ పొడవు కల్గిన ఈ మార్గంలో ఇప్పటివరకు 21 కి.మీ కడప – పెండ్లిమర్రి మార్గం మాత్రమే పూర్తయింది. గత బడ్జెట్‌లో రూ.289 కోట్లు కేటాయించారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి పట్టుబట్టి దక్కించుకున్న ఈ ప్రాజెక్టు పూర్తయితే కడప, అనంతపురం జిల్లా వాసులకు బెంగళూరు నగరం మరింత దగ్గరవుతుంది.

నైరుతి డివిజన్ పరిధిలోని...

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని పలు రైల్వేస్టేషన్లు బెంగళూరు డివిజన్ (నైరుతి రైల్వే) పరిధిలోకి వస్తాయి. రాయదుర్గం – కళ్యాణదుర్గం – తుమకూరు మధ్య 213 కిమీ నూతన రైలు మార్గానికి గత బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయించారు. అదేవిధంగా చిక్‌బళ్లాపూర్ – పుట్టపర్తి మధ్య 103 కి.మీలు, యలహంక – పెనుకొండ – ధర్మవరం మధ్య డబ్లింగ్ రైలు మార్గానికి రూ.114 కోట్లను గత బడ్జెట్‌లో కేటాయించారు.

సర్వే చేసిన నూతన రైలు మార్గాలు..

గత బడ్జెట్‌లలో కొత్త రైలు మార్గాల కోసం సర్వేలకు అనుమతిస్తూ ప్రతిపాదనలు కోరింది. ఆయా ప్రాజెక్టులకు సంబంధించి డివిజన్ అధికారులు సర్వేలు పూర్తి చేసి ఏ మేరకు నిధులు అవసరమవుతాయన్న నివేదికలను జోనల్ అధికారులకు ఇదివరకే పంపారు. ఈ బడ్జెట్‌లో నిధులు వస్తే రైలు మార్గాలు లేని ప్రాంతాల్లో రైళ్లు పరుగులు పెట్టే అవకాశం ఉంటుంది.

- ధర్మవరం – బళ్లారి 110 కి.మీల రైలు మార్గం
- రాయచోటి – హిందూపురం 162 కి.మీ మార్గం
- మంత్రాలయం – కర్నూలు 100 కి.మీ మార్గం
- ముద్దనూరు – ముదిగుబ్బ 90 కి.మీ మార్గం

కొత్త రైళ్ల ప్రతిపాదనలు...

- ధర్మవరం – గుంతకల్లు – కాచిగూడ డైలీ ఎక్స్‌ప్రెస్ రైలు
- పుట్టపర్తి నుంచి షిర్డీకి కొత్త ఎక్స్‌ప్రెస్ రైలు
- చెన్నై నుంచి హైదరాబాద్‌ల మధ్య పగటిపూట ఎక్స్‌ప్రెస్ రైలు
- గుంతకల్లు –హైదరాబాద్, గుంతకల్లు–విజయవాడల మధ్య పగటిపూట ఎక్స్‌ప్రెస్ రైలు
- సికింద్రాబాద్ నుంచి కర్నూలు మధ్య నడుస్తున్న తుంగభద్ర ఎక్స్‌ప్రెస్‌ను గుంతకల్లు వరకు పొడగించాలి



హనుమద్ వాహనంపై ఖాద్రీశుడు



కదిరి టౌన్: మధ్య నవమిని పురస్కరించుకుని సోమవారం రాత్రి హనుమద్ వాహనంపై దేవేరులతో కలసి భక్తులకు ఖాద్రీశుడు దర్శనమిచ్చారు. మరో 30 రోజుల్లో ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ వేడుకను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ గోపాలకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

తొలుత నాయకుడిగా ఎదగండి

- లోకేష్‌కు ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి బాబు హితవు



బత్తలపల్లి: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ప్రకటించుకున్న నారా లోకేష్‌కు రాజకీయం గురించి ఏ మాత్రం అవగాహన లేదని, ముందుగా ఆయన రాజకీయ నాయకుడిగా ఎదిగిన తర్వాత స్పష్టంగా తెలుగులో మాట్లాడడం నేర్చుకుని ప్రజల్లోకి వస్తే బాగుంటుందని ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు హితవు పలికారు. సోమవారం బత్తలపల్లిలోని తన స్వగృహంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యువగళం పేరుతో పాదయాత్ర చేపట్టిన లోకేష్ బాబును ప్రతి చోటా తమకేమీ లబ్ధి చేకూరుస్తావంటూ బీసీలు ప్రశ్నిస్తున్నారన్నారు. 14 ఏళ్లుగా సీఎంగా ఉన్న చంద్రబాబు, ప్రజల చేత ఎన్నిక కాకుండానే మంత్రిగా పదవి అనుభవించిన మీరు బీసీలకు ఏమి చేశారో చెప్పాలని నిలదీస్తున్నారన్నారు. కుప్పంలో బీసీలకు జగన్ సర్కార్ ప్రాధాన్యతనిస్తే అక్కడున్న రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వనితమ్మను, కురుబలను తూలనాడడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీల్లోని అన్ని కులాల అభ్యున్నతికి రూ.78వేల కోట్లను జగన్ సర్కార్ ఖర్చు చేసిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో బీసీలకు నామమాత్రపు పరికరాలు అందజేసి, రూ. వేల కోట్లను దోచుకున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక బీసీలకు అన్నింటా సముచిత స్థానం దక్కుతోందన్నారు. బీసీలకు రాజకీయ భిక్ష పెట్టింది కూడా జగనేనన్న వాస్తవాన్ని తెలుసుకుని మాట్లాడాలన్నారు. లేకపోతే బీసీల ఆగ్రహానికి గురికావాల్సి ఉంటుందని హెచ్చరించారు.

భూమి పరిరక్షణ అందరి బాధ్యత

అనంతపురం కల్చరల్: మనిషి స్వార్థ చింతన కారణంగా నాశనమవుతున్న భూమి స్వభావాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత అని శ్రీసత్యసాయి జిల్లా మడకశిరకు చెందిన సింకోడు పవన్‌కుమార్ అన్నారు. భూ పరిరక్షణ నినాదంతో పవన్‌కుమార్ చేపట్టిన దేశవ్యాప్త పాదయాత్ర సోమవారం రాత్రి అనంతపురానికి చేరుకుంది. ఈ పవన్‌కుమార్ మాట్లాడారు. గత ఏడాది ఆగస్టు 17న జమ్ములోని తావి వద్ద పాదయాత్ర ప్రారంభించినట్లు గుర్తు చేశారు. జమ్ము, హర్యానా, రాజస్తాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రా, కర్ణాటక ప్రాంతాలు దాటుకుని కన్యాకుమారి వరకూ తన పాదయాత్ర కొనసాగుతుందన్నారు. ఇప్పటి వరకూ 2,900 కిలోమీటర్లు సాగిన పాదయాత్రలో భూ పరిరక్షణపై ప్రజలను చైతన్య పరుస్తూ వచ్చినట్లు పేర్కొన్నారు. కాగా, అనంతపురానికి చేరుకున్న పవన్‌కుమార్‌ను డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, సామాజిక కార్యకర్త అనిల్‌కుమార్ రెడ్డి, అంజనమ్మ తదితరులు అభినందిస్తూ సన్మానించారు.



పవన్‌కుమార్‌ను అభినందిస్తున్న డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి

నా భర్తకు పెరోల్ ఇప్పించండి

- ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్‌కు విన్నవించిన వివాహిత
- కుటుంబం దయనీయ స్థితిలో ఉందని వేడుకోలు
- 'పోలీసు స్పందన'కు 53 వినతులు



అర్జీలు పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్

పుట్టపర్తి అర్బన్: వైఎస్సార్ జిల్లా కడప సెంట్రల్ జైలులో ఖైదీగా శిక్ష అనుభవిస్తున్న తన భర్తను పెరోల్ కింద 14 రోజులు ఇంటికి పంపేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్‌ను ఓ వివాహిత వేడుకుంది. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్పీని కలసి వినతి పత్రం అందజేసింది. వివరాలు... హిందూపురం మండలం కిరికెర గ్రామానికి చెందిన అశ్వత్థప్ప, పుష్ప దంపతులు. ఓ కేసులో ముద్దాయిగా శిక్ష పడిన అశ్వత్థప్ప కడప సెంట్రల్ జైలులో ఉంటున్నాడు. ఈ క్రమంలో కొన్ని నెలల క్రితం అశ్వత్థప్ప తల్లిదండ్రులు మృతి చెందారు. అప్పటి నుంచి కుటుంబ పరిస్థితి దయనీయంగా మారింది. పోషణ భారమై సతమవుతున్న పుష్ప... తన భర్తను 14 రోజుల పాటు పెరోల్ కింద ఇంటికి పంపితే కాస్త కోలుకునేందుకు అవకాశముంటుందని, ఎలాగైనా తన భర్తకు పెరోల్ ఇప్పించాలని ఎస్పీని వేడుకుంది.

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ 53 వినతులు అందాయి. ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ స్వయంగా బాధితుల ఉంచి అర్జీలు స్వీకరించి, మాట్లాడారు. అర్జీల పరిశీలన అనంతరం చట్టపరిధిలోని సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌బీ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, డీసీఆర్‌బీ సీఐ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

కొన్ని అర్జీలు ఇలా...

- తన కుమారుడి ఎంబీబీఎస్ సీటు కోసం డబ్బు తీసుకున్న హైదరాబాద్‌లోని విహాన్ ఎడ్యుకేషన్ కన్సల్టెంట్ ప్రతినిధి లక్ష్మీమూర్తి... చివరకు సీటు ఇప్పించకుండా మోసం చేశాడని చిలమత్తూరు మండలం కనిశెట్టిపల్లికి చెందిన శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు చేశారు. ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానంటూ లక్ష్మీమూర్తి నమ్మబలకడంతో రూ.6 లక్షలు చెల్లించినట్లు వివరించారు. అయితే సీటు రాకపోవడంతో తీసుకున్న డబ్బు తిరిగిమ్మని పలుమార్లు అడిగినా అతను స్పందించడం లేదని, ప్రస్తుతం తన ఆర్థిక పరిస్థితి ఇబ్బంది కరంగా ఉందని, ఎలాగైనా లక్ష్మీపతి నుంచి తన డబ్బు ఇప్పించి న్యాయం చేయాలని ఎస్పీని శ్రీనివాసరెడ్డి వేడుకున్నారు.
- రామగిరి మండలం కొత్తగాదిగకుంటలోని ప్రతిమకొండ వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి ఖర్చు చేసిన డబ్బు ఇప్పించాలని ఎస్పీని శిల్పి ఆనందరావు ఆశ్రయించారు. నిర్మాణ పనులకు తన సొంత డబ్బు ఖర్చు చేశానని, ఇందుకు సంబంధించి దేవదాయ శాఖ నుంచి మూడు విడతలుగా రూ.39.40 లక్షల బిల్లులు బ్యాంక్ నుంచి రాకుండా ఖాతాను కొందరు వ్యక్తులు బ్లాక్ చేశారని వాపోయారు. రెండేళ్లుగా రూ.22 లక్షలు తన సొంత డబ్బు ఖర్చు చేసినట్లు వివరించారు. ఇందు కోసం అప్పు చేయాల్సి వచ్చిందని, ప్రస్తుతం తన పరిస్థితి ఇబ్బందికరంగా ఉందని, ఎలాగైనా తన డబ్బు ఇప్పించాలని అభ్యర్థించారు.

జగన్‌తోనే గాంధీ కలల సాకారం

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ



గాంధీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని గతంలో పుస్తకాల్లో మాత్రమే చదువుకునేవాళ్లమని.. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామ స్వరాజ్యాన్ని సిద్ధింపజేసి గాంధీ కలలను సాకారం చేశారని జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ కొనియాడారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం మహాత్మాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడారు. సత్యం, అహింస మార్గాలతో దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించిన మహాత్ముడి అడుగుజాడల్లోనే సీఎం వైఎస్ జగన్ నడుస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో గ్రామ స్వరాజ్యాన్ని సిద్ధింపజేశారన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కరరెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్, నాటక అకాడమీ చైర్ పర్సన్ హరిత, బీసీ కమిషన్ సభ్యుడు కిష్టప్ప, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ రిజ్వాన్, డీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత, వ్యవసాయ మిషన్ సభ్యుడు రాజారాం, బీసీ సంఘాల రాష్ట్ర జేఏసీ ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్, మాజీ మేయర్ రాగే పరుశురాం, పామిడి వీరాంజినేయులు, కార్పొరేటర్లు అనిల్‌కుమార్‌రెడ్డి, నరసింహులు, వైఎస్సార్‌సీపీ నాయకులు రిలాక్స్ నాగరాజు, ఓబులేసు, వేముల నదీం, మనేరి కొండమ్మ, మారుతీనాయుడు, గోగుల పుల్లయ్య, భారతి, రాధాయాదవ్, కృష్ణవేణి, అంజలి, శోభారాణి, ఉష తదితరులు పాల్గొన్నారు.

జాతరకు ముస్తాబు

- ఫిబ్రవరి 2, 3 తేదీల్లో సునామ జకినీ మాత ఉత్సవాలు
- దేశ నలుమూలల నుంచి తరలిరానున్న ఆరె కటికలు



సునామ జకినీమాత మూల విరాట్

గుత్తి: ఆరె కటికల ఆరాధ్యదైవం సునామ జకినీ మాత ఉత్సవాలు ఫిబ్రవరి 2, 3 తేదీల్లో నిర్వహించనున్నారు. దేశంలోనే ఏకైక దేవాలయంగా ఖ్యాతి పొందిన ఈ ఆలయంలో ఏటా జరిగే ఉత్సవాలకు దేశం నలుమూలల నుంచి ఆరె కటికలు భారీగా తరలివస్తారు. ఈ క్రమంలో ఈ ఏడాది ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఆరె కటికల కొంగుబంగారంగా..

అరుదైన ఈ ఆలయంలో సునామ జకినీమాత, మాల్కుమని జకినీ మాత కొలువై ఉన్నారు. ఏటా మాఘమాసం రెండో శుక్రవారం సునామ జకినీ మాత జాతర ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తుంటారు. భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న అమ్మవారి రెండు రోజుల జాతరలో వేల సంఖ్యలో ఆరె కటికలు పాల్గొని మొక్కులు తీర్చుకుంటారు. సునామ జకినీ మాతను నిర్మలమైన హృదయంతో ఆరాధిస్తే సమస్త కోరికలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం.

జాతర కార్యక్రమాలు ఇలా...

ఫిబ్రవరి 2న అమ్మవారికి అభిషేకం, మహా మంగళహారతి, గణపతి హోమం, శాంతి హోమం, నవ గ్రహ హోమం, అమ్మవారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, గుత్తి ఆర్‌ఎస్‌లోని కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద నుంచి పూర్ణకుంభాలతో ఆలయం వరకూ ఊరేగింపు ఉంటుంది. అనంతరం రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 3వ తేదీ ఉదయం ఏడు గంటలకు అయ్యప్ప స్వామి ఆలయంలో సామూహిక కుంకుమార్చన, గంగ స్నానం వంటి కార్యక్రమాలు ఉంటాయి. అనంతరం నూతనంగా నిర్మించిన కల్యాణమంటపాన్ని ప్రారంభించి, ఆరె కటికల బహిరంగ సభ నిర్వహిస్తారు. కార్యక్రమానికి ఎంపీ తలారి రంగయ్య, గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డితో పాటు పలువురు ఎంపీలు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరు కానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, ఆరె కటిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలూరు లక్ష్మణరావు తెలిపారు.

విషపూరిత ద్రావకం తాగి హోంగార్డు మృతి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పొరబాటున విషపూరిత ద్రావకం తాగి ఓ హోంగార్డు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... జిల్లా పోలీసు శిక్షణ కళాశాలలో హోంగార్డుగా పనిచేస్తున్న సునీల్‌కుమార్ (41), ప్రసన్నకుమారి దంపతులు. వివాహమైన చాలా కాలం తర్వాత ప్రసన్న కుమారి గర్భం దాల్చింది. ఈ క్రమంలో ఆమెను సునీల్ కుమార్ జాగ్రత్తగా చూసుకుంటూ వస్తున్నారు. సోమవారం దాహం వేస్తుండడంతో బాటిల్‌లో ఉన్న ద్రావకాన్ని పొరబాటున నీరుగా భావించి సునీల్ కుమార్ తాగాడు. కాసేపటి తర్వాత వాంతులయ్యాయి. స్పందించిన కుటుంబసభ్యులు విషయాన్ని తెలుసుకుని వెంటనే సర్వజనాస్పత్రికి పిలుచుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం నగర శివారులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక సోమవారం సాయంత్రం సునీల్‌కుమార్ మృతిచెందాడు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు అనంతపురం నాల్గో పట్టణ పోలీసులు తెలిపారు.

భక్తుల మదిలో కొలువైన సత్యసాయి



క్రతువు నిర్వహిస్తున్న చైనీయులు

ప్రశాంతి నిలయం: మానవత్వంతో కూడిన విలువలు బోధిస్తూ ఆపన్నులకు ప్రేమను పంచిన సత్యసాయి భక్తకోటి మదిలో కొలువై ఉన్నారని, అందుకే ఎల్లలు దాటి పుట్టపర్తికి చేరుకుని సత్యసాయి పట్ల తమ భక్తి భావాన్ని చాటుతున్నారంటూ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌రాజు అన్నారు. ప్రశాంతి నిలయం వేదికగా జరుగుతున్న చైనీస్ నూతన సంవత్సర వేడుకలు సోమవారం ముగిశాయి. నార్త్ బిల్డింగ్స్ వెనుక మైదానంలో ఏర్పాటు చేసిన వేడుకల ముగింపు కార్యక్రమంలో చైనీస్ సంప్రదాయం ప్రకారం పీహెన్ కుంగ్ పేరుతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవుడికి కృతజ్ఞతలు తెలిపే క్రతువులో మడత పెట్టిన కాగితాలను సమిధలుగా వేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమానికి రత్నాకర్ రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.